మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# బస్సు ప్రమాద మృతుల కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా అందజేత

**అలంపూర్ అక్టోబర్ 26, ప్రభాతవార్త :** ఈనెల 24న కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాద ఘటనలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరుగురు మృతి చెందారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించ డంతో మృతిచెందిన చందన మంగ, సంధ్యారాణి(హైదరాబాద్), మేఘనాథ్(కోదాడ), అనూష(నల్గొండ), బొంత ఆదిశేషగిరి రావు(హైదర్గూడా), కెనుగ దీపక్ (రాయగడ్) కుటుంబ సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి. ఎం.సంతోష్ ఆదేశాల మేరకు ఆది వారం ఆర్డిఓ అలివేలు కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 5లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డిపిఓ నాగేంద్రం, ఎర్రవల్లి తహసిల్దార్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న గద్వాల ఆర్డిఓ అలివేలు

## లక్కీ 'డ్రా'ప్..

# ఎవరికో..?

- నేడు ఏ4 మద్యం దుకాణాల లక్కీడ్రా
- నూతన కలెక్టరేట్ కార్యాలయాల్లో ఏర్పాట్లు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 5530 దరఖాస్తులు



**నాలుగు ఎక్సైజ్ డివిజన్లలో దాఖలైన టెండర్ల వివరాలు**

| జిల్లా | షాపులు | దరఖాస్తులు |
|---|---|---|
| మహబూబ్‌నగర్ (నారాయణపేట) | 90 | 2487 |
| వనపర్తి | 36 | 757 |
| జోగులాంబ గద్వాల | 34 | 768 |
| నాగర్‌కర్నూల్ | 67 | 1518 |
| మొత్తం | 227 | 5530 |

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్26, ప్రభాతవార్త:** ఈ ఏడాదైనా తమకు లక్కు కలిసిరావాలని కొందరు, తమకు మళ్లీ లాటరీ తగిలి మద్యం షాపుదక్కాలని మరికొందరు, మద్యంవ్యాపారంలో తమ అదృష్టం పరీక్షించుకుందామని కొత్తగా వచ్చేవారు ఇంకొందరు..ఇలా ఎవరెవరు మద్యం టెండర్లు వేశారో వారందరీ భవితవ్యం నేడు తేలనున్నది. లాటరీ పద్ధతిలో నేటితో మద్యం టెండర్‌దారుల ఉత్కంఠకు తెరపడనున్నది. ఉమ్మడి పాలమూరులోని నాలుగు డివిజన్లలో ఏ4 మద్యం లైసెన్సు లకు సంబంధించి లక్కీ డ్రా నేడు తీయనున్నారు. మొత్తం 227 వైన్స్ షాపులకు సంబంధించి 5530 టెండర్లు దాఖలయ్యాయి. ఈమేరకు అన్ని కలెక్టరేట్ కార్యాలయాల వద్ద అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టెండర్‌దారులు ఉదయం 9గంటల వరకే కార్యాలయాల వద్దకు చేరుకోవాలని తమ వెంట ఆధార్ కార్డు,లేదా ఏదైనా గుర్తింపుకార్డు తీసుకొని రావాలని సూచించారు. సర్కారు ఈనెల 23వరకు గడువు పెంచగా నేటితో తుది గడువు కూడా ముగియనున్నది. ఈనెల 27న (సోమవారం) లక్కీ డ్రా తీయనున్నారు. ఆదివారం సెలవు దినం, సోమవారం దీపావళి పండుగ సందర్భంగా రెండు రోజులు దరఖాస్తులు స్వీకరించలేదు. మంగళవారం కూడా కొందరు సెంటిమెంట్ కారణంగా దాదాపుగా టెండర్లు దాఖలు చేయలేదు. బుధవారం ఉమ్మడి జిల్లాలోని నాలుగు డివిజన్లలో 42టెండర్లు దాఖలు కాగా మొత్తంగా 5530 దరఖాస్తులు అందాయి. మహబూబ్నగర్ డివిజన్ పరిధిలోని మహబూబ్నగర్ నారాయణపేట జిల్లాలకు సంబంధించి 2487 టెండర్లు దాఖలు అయినట్లు డిపిఈవో సుధాకర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం నాలుగు డివిజన్లు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి,గద్వాల ఉన్నాయి. జడ్చర్ల, కోస్గి, మహబూబ్‌నగర్, నారాయణ పేట, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్,నాగర్‌కర్నూల్, తెలకపల్లి, ఆత్మకూరు, కొత్తకోట, వనపర్తి, అలంపూర్, గద్వాల కలిపి 14 సర్కిళ్లున్నాయి. గద్వాల జిల్లాలో 34 మద్యం దుకాణాలు, నాగర్‌కర్నూల్ 67, వనపర్తి 36, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లా డివిజన్లు కలిపి 90 మద్యం దుకాణాలు ఉన్నాయి.

### ఉదయం 9 గంటలకే చేరుకోవాలి





జిల్లాలో ఏ4 దుకాణాల కోసం లాట్ల డ్రా సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించడం జరుగుతుంది. అసౌకర్యాన్ని నివారించడానికి దరఖాస్తు దారులు ఉదయం 9 గంటల లోపు వేదిక వద్దకు చేరుకోవాలని సూచించారు. అసలు రసీదుతోపాటు ప్రవేశ పాస్" చెల్లుబాటు అయ్యే గుర్తింపు రుజువును తీసుకురావాలి. మొబైల్ ఫోన్‌లను హాల్‌లోకి అనుమతించరని, లాట్ల డ్రా ద్వారా ఎంపిక చేయబడిన విజయవంతమైన దరఖాస్తుదారులు అదే రోజు లేదా మరుసటి రోజుషాప్ ఎక్సైజ్ పన్ను యొక్క మొదటి వాయిదాను చెల్లించాల్సి ఉంటుంది. డీపీఈవో నుండి షాప్ కేటాయింపు నిర్ధారణ లేఖను తీసుకోవాలి.ప్రతి ఒక్కరూక్రమశిక్షణను పాటించి, డ్రాప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడానికి సహకరించాలి. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు సంబంధించి మహబూబ్‌నగర్ నూతన సమీకృత సముదాయ భవనం(ఐడీవోసీ)లోని సమావేశమందిరంలో డ్రా ప్రక్రియ కొనసాగుతుంది.

- మహబూబ్‌నగర్ జిల్లా నిషేధ ఎక్సైజ్ అధికారి సుధాకర్

వివాహాలు చేసుకుంటున్న ఆదివాసులు



## 111 ఆదివాసి జంటలను ఒకే వేదికపై

# వివాహాలు చేయడం అభినందనీయం

- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ
- నల్లమల ఆదివాసీలను మరోసారి కలుస్తా
- వివాహాలు చేసుకున్న ఆదివాసి బిడ్డలు నా కూతుర్లు : హైకోర్టు జడ్జ్ టి మాధవి దేవి
- వనవాసి కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో చెంచు గిరిజనుల సామూహిక వివాహాలు



నూతన వధువరులకు వివాహ ధృవీకరణ పత్రం అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, బండారు దత్తాత్రేయ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 26 ప్రభాతవార్త:** అడవులను నమ్ముకొని జనజీవనానికి దూరంగా జీవిస్తున్న ఆదివాసీలను ఒక్క చోటుకు చేర్చి సాంప్రదాయ పద్ధతులను పాటిస్తూ ఒకే వేదికపై 111 మందికి సామూహిక వివాహాలు జరిపించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వనవాసి కళ్యాణ పరిషత్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో చెంచు గిరిజన యువతి యువకులకు 111 జంటలకు సామూహిక వివాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, హైకోర్టు జడ్జ్ టీ మాధవి దేవి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆదివాసి కళ్యాణ ఆశ్రమం అఖిల భారత కార్యకారిణి ఇండోర్‌కు చెందిన రేఖ నాగర్, ప్రాంత అధ్యక్షులు కాట్రాజు వెంకటయ్య, శ్రీశ్రీశ్రీ అంబత్రాయ క్షేత్ర పీఠాధిపతి అదిత్య పర శ్రీ స్వామిలు సామూహిక వివాహాలు చేసుకున్న దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ అడవి బిడ్డల వివాహానికి హాజరు కావడం ఆనందంగా ఉందని ఈ ప్రాంత చెంచు గిరిజనులను మరొకసారి కలుసుకుంటానని గవర్నర్ అన్నారు. సమాజంలో ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి సామాజిక రుగ్మతలను దూరం చేసే కార్యక్రమాలకు సాక్షత్తు భగవంతుడే అండగా ఉంటారని గవర్నర్ అన్నారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలకు దేవుడి అండ దండలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ వేదికపై సామూహిక వివాహాలు జరుపుకున్న..

-మిగతా4లో..

## నాగర్‌కర్నూల్‌లో

# గంజాయి కలకలం

- గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ 8 మంది యువకులు
- విలేకరుల సమావేశంలో డి.ఎస్పి బుర్రి శ్రీనివాస్



విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

**నాగర్‌కర్నూల్, అక్టోబరు26 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో కొంతమంది యువకులు గంజాయికి బానిసగా మారి పోలీసులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో డిఎస్పి బుర్రి శ్రీనివాసులు మాట్లాడుతూ నాగర్ కర్నూల్‌లోని ఒక లాడ్జిలో కొంతమంది యువకులు గంజాయి సేవిస్తున్నారని పక్కా సమాచారంతో తనిఖీ చేయగా గంజాయిసేవిస్తున్న 8 యువకులతో పాటు 735 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకోవడం జరిగింది. ఈ గంజాయి హైదరాబాద్ నుంచి సప్లై అవుతుందని తమ విచారణలో తేలిందని గంజాయి సేవించిన యువకులను రిమాండ్‌కు తరలించడం జరుగుతుందని అన్నారు. గంజాయి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గంజాయి విషయంలో ఎవరికైనా ఎలాంటి సమాచారం తెలిసిన స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం తెలపాలని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ అశోక్ రెడ్డి, ఎస్సై గోవర్ధన్, పోలీసులు టైటిల్ పాల్గొన్నారు.

# 150 ఇండ్లలో సోదాలు

- 19 బైక్‌లు,6 ఆటోలు స్వాధీనం
- జడ్చర్లలో విస్తృతంగా కార్డన్ సెర్చ్
- అక్రమ వాహనాలు, నేరాలను నివారించేందుకే : డీఎస్పీ వెంకటేశ్వర్లు

3



# సువర్ణ బూషితుడైన కురుమతి స్వామి

- వైభవంగా కురుమూర్తి స్వామి అలంకారోత్సవం
- అంబరాన్నంటిన స్వర్ణాభరణాల ఊరేగింపు
- గోవింద నామస్మరణతో మార్మోగిన కురుమతి కొండ
- ఆభరణాల ధగధగతో పులకించిన కాంచనగుహ
- పూజలు చేసిన మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ డికె అరుణ, ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



ఆభరణాలకు స్వాగతం పలుకుతున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే జిఎంఆర్

**మహబూబ్‌నగర్ (చిన్నచింతకుంట), అక్టోబరు 26 ప్రభాతవార్త:** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి ఘట్టం స్వర్ణాభరణాల ఊరేగింపు అంబరాన్నంటింది. అమరచింత నుంచి పట్టువస్త్రాలను పద్మశాలీలు తీసుకురాగా వనపర్తి జిల్లా ఆత్మకూరు లోని ఎస్‌బీఐ బ్యాంకులో భద్ర పరిచిన స్వామివారి స్వర్ణఆభరణాల కు బ్యాంక్ అధికారులు దేవస్థాన ఈవో మధనేశ్వర్ రెడ్డి, చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి, స్వర్ణకారులైన గాడి వంశీయుల సమక్షంలో లాకర్ నుంచి స్వర్ణాభరణాల పెట్టెను బయటకు తీశారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, రాజ శ్రీరామ్‌భూపాల్, బాలల హక్కుల చైర్పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, పాలక మండలి సభ్యులతోపాటు పలువురు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం గాడి వంశస్తులైన లక్ష్మీనారాయణ ఆభరణాల పెట్టెను తలపై పెట్టుకొని ఊరేగింపుగా బయలుదేరారు. సంప్రదాయ వాయిద్యాలైన కుర్వ డోళ్లు, భాజాభజంత్రీలు, మేళతాళాల మోతలు ఓ వైపు.. మరోవైపు శివసత్తుల పూనకాలు, డీజే సౌండ్ హోరు, పటాకుల మోతతో అట్టహాసంగా సాగింది. కేరళ కళాకారులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాయిద్యం అందరినీ ఆకట్టుకుంది. ఊరేగింపు పొడవునా వేలాదిగా భక్తులు స్వామివారి స్వర్ణాభరణాలను తాకి మొక్కేందుకు పోటీపడ్డారు. పరమేశ్వరుని చెరువు కట్ట మీదుగా ఊరేగింపు మదనాపురం మండలం కొత్తపల్లికి చేరుకున్నది. ఈ సందర్భంగా గ్రామస్థులు, భక్తులు పూలు చల్లుతూ వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం దుప్పల్లి మీదుగా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అమ్మాపురం గ్రామంలోని ముక్కెర వంశానికి చెందిన రాజా రాంభూపాల్ నివాసానికి చేరుకున్నది. వేద పండితులు, అర్చకులుఆభరణాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే జిఎంఆర్, మాజీ ఎమ్మెల్యేలు

-మిగతా4లో..

# రైతు పక్షపాతి కాంగ్రెస్

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, అక్టోబర్ 26 ప్రభాతవార్త:** రైతన్న మేలు, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రుణమాఫీ, పెట్టుబడి సహాయం అందిస్తూ పంట నష్ట పరిహారం అందిస్తూ రైతు పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో కల్వకుర్తి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని పొల్యూషన్ బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆరుగాలం చెమటొడ్చి పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, తేమ శాతం ద్వారా గిట్టుబాటు ధరను కల్పిస్తూ కొనుగోలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్న అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతూ రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధరనుకల్పించి కొనుగోలు చేసేందుకు వ్యవసాయ సహకార కేంద్రాల ద్వారా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

-మిగతా4లో..

## విద్యా,వైద్యంలో

# నెంబర్‌వన్ చేస్తాం

- సర్కారు బడుల్లో కార్పొరేట్ స్థాయి విద్య
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు26,ప్రభాతవార్త:** హోల్ సేల్ యజమానులు రిటేల్ షాపులు పెట్టకుండా కట్టడి చేసేందుకు కృషి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం విద్య, వైద్యం లో ముందుంటేనే మహబూబ్ నగర్ ఫస్ట్ గా ఉంటుంది ఎమ్మెల్యే గా తాను గెలిచిన తర్వాత మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ విద్యాసంస్థలలో కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి వచ్చింది అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగరం, వడ్డెర బస్తీ లోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ భవనంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ మరియు ప్రైవేటు ఎలక్ట్రికల్ షాప్స్ యాజమానులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ భవన నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్ నగర్ అన్నింట్లో ఫస్ట్ ఉండాలంటే విద్య, వైద్యం లో మనం ముందుండాలని అన్నారు. అందుకే తాను విద్య , వైద్యం పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాను అని తెలిపారు. ఆర్థికంగా బలంగా లేనివారు ప్రభుత్వ విద్యాసంస్థలలో మీ పిల్లలను చేర్పించాలని వారికి మంచి విద్యను అందించే బాధ్యత తనదేనని ఆయన స్పష్టం చేశారు. ఏ ఆపద ఎక్కడినుంచి వస్తుందో తెలియదు కాబట్టి ఆపద సమయంలో మనకు అండగా ఉండే మెడికల్ ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఆయన సూచించారు. డబుల్ బెడ్రూం ఇండ్లు పథకం ప్రజలను మభ్య పెట్టే పథకమని ఆయన ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఆయన చెప్పారు. హోల్ సేల్ యాజమాన్యంతో మాట్లాడి కొత్తగా రిటేల్ షాపులు పెట్టకుండా కట్టడి చేసేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ , మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, అజ్మత్ అలి, మైత్రి యాదయ్య, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అంజద్ ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ యూనియన్ నాయకులు వి.వెంకటాచారి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## బీసీ సంక్షేమ సంఘం, బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుల నియామకం



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్, అక్టోబరు 26 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి ముకుంద నాయుడు ఆధ్వర్యంలో బీసీ సంఘం ముఖ్య సమావేశం నిర్వహించి మండల కమిటీ నియామకం ఏర్పాటు చేయడం జరిగింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం శ్రీరంగాపూర్ మండల అధ్యక్షులుగా జి విరాటు ను, జాతీయ బీసీ యువజన సంఘం మండల అధ్యక్షులుగా హెచ్.కె రాజేష్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి ముకుంద నాయుడు నియమించడం జరిగింది.ఈ సందర్భంగా ముకుంద నాయుడు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైనసభ్యులు మండల పరిధిలోని బీసీలసంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయాలని, ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జరిగే భవిష్యత్తు కార్యాచరణలో అందరూ పాల్గొనేలా చేసి బీసీల రిజర్వేషన్ ప్రక్రియలో కీలకంగా పని చేస్తూ బీసీ ప్రజానీకాన్ని చైతన్యం చేయాలని కోరారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆ విధంగా ఆర్.కృష్ణయ్య ఎల్లప్పుడూ పనిచేస్తూ ఉంటారని అందరం కలిసి బీసీల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి ముకుంద నాయుడు, బీసీ నాయకులు జి విరాట్, హెచ్‌కె. రాజేష్, విష్ణు, చరణ్,శివ, రాము, శోభన్ బాబు, చందు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో చేప పిల్లలు వదిలిన మత్స్యకారులు

**ఉప్పునుంతల, అక్టోబరు 26 ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూరు ఊర చెరువులో ఆదివారం ఉదయం మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలారు. దాదాపు 1 లక్ష 50 వేల చేప పిల్లలను వదిలారు. బొచ్చ ,రవ్వ తదితర రకమైన చేప పిల్లలను చెరువులో వదిలినట్లు మత్స్య కారుల సంఘం సభ్యులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ, ప్రభుత్వం సొసైటీ అభివృద్ధికి ప్రోత్సాహకం అందించాలని వారు కోరారు. చెరువులో చేప పిల్లలు వదిలిన వారిలో మాజీ ఎంపీటీసీలు రెడ్డి రెడ్డి రంగారెడ్డి, సర్వేశ్వర్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సాగునీటి సంఘం చైర్మన్ బూసిరాజ్ మల్లయ్య, గ్రామ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు పొలం కాశన్న, కార్యదర్శి జంగయ్య, గ్రామస్తులు గోస్కె బాలరాజు, శ్రీశైలం, గుద్దటి బాలరాజు, సైదులు, నల్గొండ జిల్లా డిండి ప్రాజెక్టు సంఘం సభ్యులు తిరుపతయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ లింగమయ్య, నిరంజన్, శివ, వెంకటేష్, రాజు, నాగేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్రం సహకరించాలి

**దేవరకద్ర ,అక్టోబరు 26 ప్రభాతవార్త:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని బీసీ యువ నాయకుడు కౌకుంట్ల యువజన అధ్యక్షులు నరేష్ తెలిపారు. అత్యధిక శాతం జనాభా కలిగిన బీసీలు ఉపాధి, రాజకీయ, ఆర్థిక, రంగాలలో వెనుకబడి ఉన్నామని తెలిపారు. ఎంతో కాలంగా బీసీలు అనేక విధాలుగా మోసపోతున్నారని వాపోయారు. ప్రస్తుతం ప్రతి రంగంలో బీసీలకు సముచిత స్థానం సాధించుకునే దిశగా పోరాటం సాగించే తరుణం వచ్చిందన్నారు. బీసీలకు రిజర్వేషన్ల సాధనలో అన్ని పార్టీలు సంపూర్ణమైన మద్దతు ఇవ్వాలని కోరారు. భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ ప్రకారం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందినప్పుడే బీసీలకు తగిన రిజర్వేషన్లు లభిస్తాయని తెలిపారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే విధంగా బీసీలు ఐక్యంగా ఉద్యమించి, బిసి రిజర్వేషన్లు సాధించుకోవాలని యువజన అధ్యక్షులు నరేష్ కోరారు.

## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన స్నేహితులు



మిత్రుడి కుటుంబానికి సహాయం అందజేసిన క్లాస్మేట్స్

**పెబ్బేరు, అక్టోబరు 26 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం తోమాలపల్లి గ్రామానికి చెందిన విష్ణు అనారోగ్యంతో రెండు నెలల కిందట మరణించడం జరిగింది. తామందరితో కలిసి చదువుకున్న మిత్రునికి ఎంతోకొంత అండగా నిలవాలని రూ.58500ల ఆర్థిక సహాయం చేసి అతని చిత్ర పటానికిపూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. గతంలో కూడా ఇలా జరిగినప్పుడు సహాయం చేశాము.ఇకముందు కూడా మనమిత్రులలో ఎవరికి ఆపద వచ్చినా మన వంతు సహాయం చేయాలని నిర్ణయించడం జరిగింది. కుటుంబ సభ్యులు సాయం అందించిన వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. అందుబాటులో ఉన్న మిత్రులు వెళ్లి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దస్తగిరి, మహేష్,శివనారాయణ, గోవిందు, ఖాజా బంగారు రవి, జి.సురేష్, తిరుపతి, శివరాం, ఆంజనేయులు, మంగలి రఘు, శేఖర్, నాగరాజు, పరశురాములు, కిషోర్ పాల్గొన్నారు.

## లట్టుపల్లి గడ్డం శ్రీకాంత్‌కు డాక్టరేట్




డాక్టరేట్ అందుకుంటున్న గడ్డం శ్రీకాంత్

**బిజినేపల్లి, అక్టోబరు 26 ప్రభాతవార్త:** ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ లట్టుపల్లి గ్రామానికి చెందిన గడ్డం శ్రీకాంత్ కు గౌరవ డాక్టరేట్ న్ ప్రధానం చేశారు.ఆదివారం తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు నగరంలో ఐటీసీ పార్థున్ హోటల్లో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ ను అందుకున్నారు. అఖిల భారత పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ లో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గడ్డం శ్రీకాంత్ పనిచేస్తూ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థిని విద్యార్థుల సమస్యలపై హాస్టల్లో మౌలిక వసతులపై పోరాడుతున్నారు. సేవలకుగుర్తింపుగా ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు గౌరవడాక్టరేట్ ను అందించినట్లు వివరించారు. శ్రీకాంత్ డాక్టరేట్ అందుకోవడం పట్ల గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

## డీఆర్‌డీఏ పీడీ ఊట్కూర్ ఐకేపీ ఏపీఎంలకు రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ నోటీసులు



**నారాయణ పేట, అక్టోబరు26 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఊట్కూర్ ఐకేపీ ఏపీఎం లకు రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ నోటీసులు జారీ చేసినట్లు సమాచార హక్కు పరిరక్షణ ఐక్యవేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కొనింటి నర్సింహులు తెలిపారు. 29వ తేదీ ఉదయం 10 గం.లకు డీఆర్‌డీఏ పీడీఊట్కూర్ ఐకేపీ ఏపీఎంలు కమిషన్ ముం దు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారని ఆయన తెలిపారు. 2022 సంవత్సరం నుండి ఊట్కూర్ మండల పరిధిలోని గ్రామాల వారీగా తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేసిందని నారాయణపేట జిల్లాకు ఎన్ని చీరలు వచ్చాయో ఒక్కో చీర ఖరీదు ఎంత గ్రామాల వారీగా మహిళా సంఘాలకు, మహిళలకు ఎన్ని పంపిణీ చేశారో వివరాలు ఇవ్వాలని డీడీ ద్వారా దరఖాస్తు చేసినా ఇప్పటివరకు సమాచారం ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. అలాగే ఫిబ్రవరి 2018 సంవత్సరం నుండి నారాయణపేట జిల్లా డీఆర్‌డీఏకి వచ్చిన నిధుల వినియోగం 2017లో మండల వారీగా విడుదల చేసిన నిధులు మహిళా సంఘాలకు మంజూరైన నిధుల వివరాలు శ్రీనిధి నిధులు జమ అయిన సమాచారం మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలపై వివరాలు అడిగి 31 102022న దరఖాస్తు చేసినా సమాధానం లభించలేదని ఆయన తెలిపారు. తదుపరి 04.02. 2023న జిల్లా డీఆర్‌డీఏ ఏపీడీకి అప్పీల్ చేసినా సమాచారం అందకపోవడంతో రాష్ట్ర సమాచార హక్కు కమిషన్‌ను ఆశ్రయించినట్లు ఆయన వివరించారు. ఈ మేరకు కమిషన్ స్పందించి సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం

- చిన్న వయసులోనే గుండెపోటు ఎందుకు వస్తుంది
- హార్ట్ స్ట్రోక్ రావడానికి ముందు ఏమవుతుంది
- గుండె సమస్యలకు అనేక కారణాలు
- గుండెపోటు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు
- కౌకుంట్ల వైద్యాధికారి డాక్టర్ రఘువరన్



**దేవరకద్ర, అక్టోబరు 26 ప్రభాతవార్త:** నాణ్యతలేని ఆహారంతో శరీరంలో చెడుకొలెస్ట్రాల్ పెరుకుపోతుంది. వ్యాయామం లేక పోవడం వల్ల మంచి కొలెస్ట్రాల్ తగ్గుతుంది. ఆ మేరకు చెడు కొలెస్ట్రాల్ అధికమైపోయి గుండెపై భారం పడుతుంది. గుండెపోటు వస్తుందని కౌకుంట్ల వైద్యాధికారి డా. రఘువరన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుఖవంతమైన జీవనం కోసం సమకూర్చుకుంటున్న సౌకర్యాలు సాంకేతిక పరిజ్ఞానాలే మనిషి ఆయు వును తగ్గించేస్తున్నాయి. ఓవైపు టెక్నాలజీ పెరుగుతున్నది. వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతున్నది. మరోవైపు మనిషి ఆరోగ్యం మాత్రం అపసవ్య దిశలో పరిగెడుతున్నది. ఒకప్పుడు 60 పైబడిన వారిలో మాత్రమే గుండె సమస్యలు కనిపించేవి. నేడు 40 ఏళ్ల లోపు వారిని హృద్రోగం మింగేస్తున్నది. చిన్న వయసులో గుండె సమస్యలకు అనేక కారణాలు ఉన్నాయి. ధూమపానం. గుండెపోటుకు గురవుతున్న ప్రతి ఐదుగురిలో ఒకరు ధూమపాన ప్రియులే అన్నారు. పొగ వల్ల రక్తం చిక్కబడుతుంది. ఫలితంగా గడ్డ కట్టే తత్వం పెరిగిపోతుంది. మృదువుగా ఉండాల్సిన రక్తనాళాలు కఠినంగా మారతాయి. ఫలితంగా రక్తపోటు అధికంగా అవుతుంది. మంచి కొలెస్ట్రాల్ తగ్గిపోయి, చెడు కొలెస్ట్రాల్ పేరుకు పోతుందన్నారు. రోగి పీల్చిన పొగ నేరుగా రక్తనాళాలను దెబ్బతీయడం వల్ల తక్షణమే రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉందన్నారు. ధూమపానం చేసే వారికి గుండెపోటు వస్తే కనుక మందులు కూడా సమర్థంగా పని చేయవు అన్నారు. ఇతరులు తాగిన పొగను పీల్చడం ద్వారా కూడా గుండెపోటు రిస్కు 20నుంచి 30 పెరుగుతుంది. దీన్నే పాసివ్ స్మోకింగ్ అంటారని డా. రఘువరన్ అన్నారు. ఆహారపు అలవాట్లు. గత పదేళ్లలో ఆహారపు అలవాట్లు చాలా మారిపోయాయి. తాజా కూరగాయలు పండ్లు తీసుకునే అలవాటు తగ్గిపోయింది. డీప్ ఫ్రై చేసిన పదార్థాలు, బేకరీ ఐటమ్స్, ప్రాసెస్డ్ ఫుడ్, ఆరగించడం ఫ్యాషన్‌గా మారింది. దీనివల్ల బరువు పెరుగుతుంది కొలెస్ట్రాల్ షుగర్ స్థాయిలు హద్దు మీరుతాయని డా. రఘువరన్ అన్నారు. మానసిక ఒత్తిడి. గతంలో కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉండేది. కరోనా కాలం నుంచి ప్రతి ఇల్లు వర్క్ ఫ్రం హోంతో బిజీబిజీగా కనిపిస్తున్నది. మినీ ఆఫీస్‌గా మారుతున్నది. ఇంట్లో నుంచే పని చేస్తుండడంతో సేద తీరే అవకాశం లేకుండా పోయింది. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నది యువత. కుటుంబ ఆర్థిక సమస్యలు తదితర కారణాలవల్ల మానసిక రుగ్మతలు అధికంగా అవుతున్నాయి. ఈ సైకాలజికల్ స్ట్రెస్ కూడా గుండెపోటుకు ఓ కారణమని అన్నారు. గుండెపోటు రాకుండా తగు జాగ్రత్తలు. గుండెపోటు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డా. రఘువరన్ మాట్లాడుతూ ధూమపానం మానేయాలి. తాజా పండ్లు కూరగాయలు తీసుకోవాలి. తీపి, ఉప్పు, నెయ్యి, తగ్గించాలన్నారు. రెడ్ మీట్, మటన్ తగ్గించాలన్నారు. వనస్పతి నూనెతో చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్యాకేజ్ ఫుడ్స్ తినకూడదన్నారు. బరువు పెరగకుండా జాగ్రత్త పడాలన్నారు. రోజు కనీసం 30నిమిషాల పాటు వాకింగ్, జాగింగ్, లేదా స్విమ్మింగ్ చేయాలని, అదేవిధంగా వారంలో ఐదు రోజులు ఏదో ఒక వ్యాయమం తప్పని సరి చేయాలన్నారు. మధుమేహం కొలెస్ట్రాల్ నియంత్రణలో పెట్టుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు బిపి పరిరక్షి ంచుకోవాలన్నారు. ఆకస్మిక వ్యాయమాలు మితిమీరిన శారీరక శ్రమ వద్దే వద్దన్నారు. యోగా ధ్యానం దినచర్యలో భాగం చేసుకోవాలని కోకుంట్ల మండల వైద్యాధికారి



## పెన్షన్‌దారుల సమస్యలపై నిత్యం పోరాడుతాం

- రిటైర్డ్ అయి డబ్బులు రాని పెన్షన్‌దారులకు వెంటనే డబ్బులను విడుదల చేయాలి
- పెండింగ్లో ఉన్న డీఎల డబ్బులు విడుదల చేయాలి
- రిటైర్డ్ ఉద్యోగస్తుల మాజీ అధ్యక్షులు మద్దిలేటి



**అలంపూర్ అక్టోబర్ 26, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకలోని ఉన్న రిటైర్డ్ పెన్షన్ ధరల సమస్యలపై నిత్యం పోరాడుతామని తాలూకా రిటైర్డ్ ఉద్యోగస్తుల మాజీ అధ్యక్షులు మద్దిలేటి,కార్యదర్శి సదానందమూర్తిలు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, అలంపూర్ తాలూక లోని ఉన్న రిటైర్డ్ పెన్షనర్లు వారి వారి సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. పెన్షనర్ల సమస్యలు అలంపూర్ ఎస్టిఓ కార్యాలయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటి సమస్యను మా దృష్టికి తీసుకువస్తే సంబంధిత ఎస్‌టిఓ అధికారితో మాట్లాడి పరిష్కరించడం జరుగుతుందన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగస్తులకు పెన్షన్ వస్తూ,వస్తూ, మధ్యలో ఆగిపోయిన వాటికి సంబంధించిన పెన్షన్ రాకపోవడంతో అట్టి సమస్యలను కూడా పరిష్కరించి వారికి పెన్షన్ వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు.పెన్షన్ దారులను సంబంధించి ఎస్టీఓ కార్యాలయంలో ఎవరైనా ఇబ్బందులకు గురిచేసే అట్టివాటిని సహించేది లేదనిఅన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా లోని 2500 వందల మంది పెన్షన్ దారులు ఉన్నారని, తెలంగాణ రాష్ట్రంలో లక్షలాదిగా రిటైర్డ్ అయిన పెన్షన్ దారులకు ఇప్పటివరకు ప్రభుత్వం నుండి వారికి రావాల్సిన డబ్బులను వారి వారి అకౌంట్లో జమ చేయలేదని ఇది చాలా ఇబ్బందికరమని రిటైర్మెంట్ అయిన ఉద్యోగస్తులు డబ్బులు రాక కుటుంబాల భారం ఎక్కువ కావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వారి డబ్బులురాని వారికి వెంటనే జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మొట్టమొదటిసారిగా ఉద్యోగంలోవిధులో చేరి రిటైర్మెంట్ వయసు వరకుప్రభుత్వానికి సర్వీసుచేసి రిటైర్మెంట్ డబ్బులు రాకపో వడంతో చాలా ఇబ్బందులు పడుతూ కుటుంబాల పోషణ భారంగా మారుతున్నాయి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వెంటనే రాష్ట్రంలోని రిటైర్డ్ అయి డబ్బులు రాని వారికి ప్రత్యేక నిధులు కేటాయించి డబ్బులనువెంటనే విడుదలచేయాలని అన్నారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వంపెండింగ్లో ఉన్న డీఏలను రిటైర్మెంట్ పెన్షన్ దారులకు ఇవ్వాలని వాటిని వెంటనే విడుదల చేసి పెన్షన్ దారుల అకౌంట్లో జమ చేయాలనిప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని ఉన్న పెన్షన్ దారులందరకు వెంటనే పిఆర్సి ప్రకటించి వారి కుటుం బాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఆలంపూర్ తాలూకలోని పెన్షన్ దారుల కొత్త కార్యవర్గ బాడిని త్వరలోనే తేదీ ప్రకటించి ఎన్నుకోవడం జరుగుతుందని అధ్యక కార్యదర్శులు తెలిపారు.

## జనుంపల్లి బ్రదర్స్ పై అసత్య ప్రచారాలు మానుకోండి

- కాంగ్రెస్ నాయకులు



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**నవాబుపేట, ప్రభాతవార్త 26 అక్టోబర్:** జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మాజీ అధికార ప్రతినిధి దుష్యంత్‌రెడ్డిపై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని లేదంటే తీవ్ర పరిమాణాలు ఉంటాయని ఆదివారం విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిని హెచ్చరించారు. గత కొద్ది రోజులుగా మాజీ డిసిసి అధికార ప్రతినిధి దుష్యంత్ రెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని కొందరు చూస్తున్నారని యూత్ కాంగ్రెస్ ,మండల కాంగ్రెస్ నాయకులు దీనిని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇప్పటినుంచి లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని యూత్ కాంగ్రెస్ నాయకులు తెలియజేశారు. టిఆర్ఎస్ నాయకుల మాయలో పడి కాంగ్రెస్ పార్టీకి భంగం కలిగిస్తే కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఊరుకోరని మరొకసారి హెచ్చరిస్తున్నామని,ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రభుత్వఅండదం డలతో పలు అభివృద్ధి పనులు చేస్తున్న జనంపల్లి బ్రదర్స్ పై ఓర్వలేక ఈ అసత్య ఆరోపణలు జరుగుతున్నాయని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు నీలకంఠం రాజశేఖర్, అంబదాస్ బంక వెంకటయ్య, ఆంజనేయులు, మచ్చేందర్, ఆనంద్, రాజేష్ తదితర కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## అండర్ డ్రైనేజ్‌తో అలంపూర్ ఆగమాగం

- మురుగునీరు రోడ్లపై పారుతున్న పట్టింపు ఏది?
- నిర్లక్ష్య ధోరణిలో ఆలంపూర్ మున్సిపాలిటీ అధికారులు



రోడ్లపై పారుతున్న అండర్ డ్రైనేజ్ మురుగునీరు

**అలంపూర్ అక్టోబర్26, ప్రభాతవార్త :** ఆలంపూర్ మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ ద్వారా అల్లంపూర్ ఆగమాగంగా తయారైంది. గత కొన్ని సంవత్సరాల క్రితం 10 కోట్ల రూపాయలతో అండర్ డ్రైనేజ్ పనులను చేపట్టిన నాయకులు అధికారులు అలంపూర్ను అన్ని విధాల అభివృద్ధిలో వెనుకబడి ఉన్నదని చెప్పడానికి ఇదొక ఉదాహరణ. అండర్ డ్రైనేజ్ పేరుతో 10 కోట్ల రూపాయలను మంజూరు చేసి అప్పటి పాలకులు అలంపూర్‌లోని ఉన్న అన్ని వార్డులలో రోడ్లన్నీ సర్వనాశనం చేయించిఅండర్ డ్రైనేజ్ ని ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం ఈ అండర్ డ్రైనేజీ కాలువల ద్వారా అలంపూర్ రోడ్లన్నీ మురుకు కంపుతో ప్రజలకు దర్శనం ఇస్తున్నాయి. అండర్ డ్రైనేజ్ మురుకునీరు లీకు అయి రోడ్లపై పారుతున్న మున్సిపల్ అధికారులకు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్లపై వెళ్లాల్సిన వృద్ధులు చిన్నారులు ప్రజలు ఈ మురుగు నీటి ద్వారా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంజూరు చేయించిన 10 కోట్ల రూపాయల అండర్ డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా తయారు కావడంతో అల్లంపూర్ ప్రజలకు ఇది ఒక శాపంగా తయారయింది. అప్పట్లో 10 కోట్ల రూపాయలలో వారి అమ్మమ్మలు పర్సంటేజ్ ముట్ట చెప్పుకొని అల్లంపూర్ రోడ్లన్నీ అండర్ డ్రైనేజ్ ద్వారా ఇబ్బందిలోను ప్రజలు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కమిషనర్ అండర్ డ్రైనేజీ ద్వారా మురుకునీరు రోడ్లపై పారుతున్న వాటిని వెంటనే సరి చేయించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ అండర్ డ్రైనేజీ మురుగునీరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక ఉన్న రోడ్లపై గత కొన్ని రోజుల నుండి మురుగునీరు రోడ్లపై పారుతుందని ఆ కాలనీ ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు.

## నేటి నుంచి కొల్లంపల్లి ఉర్సు ఉత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

**నారాయణ పేట, అక్టోబరు 26 ప్రభాతవార్త :** నారాయణ పేట మండల పరిధిలోని కొలంపల్లెలో హజరత్ సయ్యద్ షా అహ్మద్ ఖతాల్ హుసైని అష్రఫీ జలాలి రహ్ వారి 551వ ఉరుసు షరీఫ్ అక్టోబర్ 27 నుంచి ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ఉదయం 11 గం.ల నుంచి అంతర్మత సదస్సు నిర్వహించబడుతుంది. ఆసర్ నమాజ్ అనంతరం జలాలియా పతాకం ఎగురవేత మఘ్రిబ్ నమాజ్ అనంతరం లంగర్ ఖతాలియ్యా రాత్రి ఇషా నమాజ్ అనంతరం జల్సా ఎ అజ్మత్ ఎ అల్లియా సభ జరుగుతాయి. అక్టోబర్ 28న ఫజర్ నమాజ్ అనంతరం సందల్ ఊరేగింపు మధ్యాహ్నం మహిళల సభ రాత్రి చరాగాన్, సమా మహ్ఫిల్ నిర్వహించబడతాయి. అక్టోబర్ 29న ఉదయం ఖుల్ మహ్ఫిల్ తబర్రుకుల పంపిణీతో కార్యక్రమాలు ముగుస్తాయి. ఈ వివరాలను బారగాహ్ ఖతాలియ్యా సజ్జాదా నషీన్ సయ్యద్ జలాల్ హుసైని అష్రఫీ తెలిపారు. సమస్త ముస్లింలు ఆరుసు శరీఫ్‌లో పాల్గొనాలని ఆయన కోరారు.

## మిషన్ భగీరథ నీటిలో మలినాలు?



ఒండుతో వచ్చిన మిషన్ భగీరథ నీరు

**ఊట్కూర్, అక్టోబరు 26 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా వచ్చిన శుద్ధమైన మంచి నీరు కలుషితమై ఒండుతో కూడి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయాన్ని సామాజిక కార్యకర్త మహేష్ గౌడ్ ప్రస్తావిస్తూ,ఒండుతో కూడిన నీటిని ప్రజలు ఎలా తాగాలి?" అని ప్రశ్నించారు. కలుషిత నీరు తాగడం వల్ల గ్రామస్తులకు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను విజ్ఞప్తి చేశారు.

## స్నేహితురాలికి ఆర్థిక సాయం అందించిన బాల్య మిత్రులు



**పెబ్బేరు, అక్టోబరు 26 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణ శ్రీ సరస్వతి విద్యానికేతన్‌లో చదువుకున్న చిన్ననాటి స్నేహితురాలు బి,సుమలత అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న 2006,07 పదవ తరగతి బ్యాచ్ వారి ఇంటికి వెళ్లి రూ.56,100/ యాభై ఆరు వేయిల ఒక వంద రూపాయలను ఆర్థిక చేయూత నందించి మనోధైర్యాన్ని ఇచ్చి స్నేహానికి అసలైన నిర్వచనం చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లాస్మేట్స్ పాల్గొన్నారు.

## పద్మశ్రీ ఐవి సుబ్బారావు రైతు నేస్తం అవార్డు అందుకున్న డాక్టర్ రాఘవేంద్రరెడ్డి




రైతు నేస్తం అవార్డు అందుకున్న డా. రాఘవేంద్ర రెడ్డి

**పెబ్బేరు, అక్టోబరు 26 ప్రభాతవార్త:** రైతు నేస్తం పురస్కారాలు 2025 సందర్భంగా,రైతు నేస్తం,ముప్పవరపు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటి రెండు ఉభయ రాష్ట్రాల నుండి రైతుల విభాగంలో డాక్టర్ టి రాఘవేందర్ రెడ్డి కి ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను,వైద్య వృత్తిలో ఉండి వ్యవసాయంపై మక్కువతో డాక్టర్స్ ఫార్మ్ అయ్యవారిపల్లె గ్రామం పెబ్బేరు మండలం వనపర్తి జిల్లా, తన స్వంత వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ దేశీ వరి వంగడాలు(నవార,బహురూపి,దేవకి) పండిస్తూ,అంతర పంటలుగా మినుములు,సద్దలు,వేరుశనగ, కందులు ,పెసర్లు, పండిస్తూ తోటి రైతులకు ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పిస్తున్నందుకు,హాస్పిటల్‌కి వచ్చేపేషెంట్‌లకు కూడా రసాయనాలు లేనిఆహారం గురించి అవగాహన కల్పిస్తున్నందుకు గాను ఈ అవార్డునుఇస్తున్నట్లు కమిటీ సభ్యులుతెలిపారు. ఉత్తమ రైతు అవార్డును పూర్వఉపరాష్ట్రపతి శ్రీముప్పవరపు వెంకయ్యా నాయుడు,తుమ్మలనాగేశ్వరరావు తెలంగాణరాష్ట్ర వ్యవసాయ మంత్రి, ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు పాల్గొని పురస్కారం అందచేశారు.

## బిఆర్ఎస్‌లో చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాసు హనుమంతునాయుడు

**గద్వాల టౌన్ అక్టోబర్ 26, ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం కె.టీ.దొడ్డి మండలం ఈర్లబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గద్వాల నియోజక వర్గ బిఆర్ యస్ పార్టీ ఇంచార్జీ బాసు హనుమంతు నాయుడు ఆద్వర్యంలో బిఆర్‌యస్ పార్టీలో చేరారు. ఆదివారం తన స్వగృహ ఆవరణలో బిఆర్‌యస్ పార్టీలోకి చేరికలు జరుగగా రవి,పెద్దబావి వీరేష్, మల్కా శ్రీను,జేసీబీ రంగన్నలకు బాసు హనుమంతు గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మోనేష్,రాయపురంవీరేష్,ప్రహ్లాద్, వెంకటేష్ యాదవ్,రజినిబాబు,పార్టీ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరులకు ఘన నివాళి

- పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి : టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు

**నారాయణ పేట, అక్టోబరు 26 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఎస్పీ డా.వినీత్ ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నారాయణపేట పట్టణంలో సావర్కర్ చౌరస్తా నుండి సత్యనారాయణ చౌరస్తా వరకు పోలీసులు యువత ప్రజలు కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరవలేనివి వారు సంఘవిద్రోహ శక్తులతో పోరాడి ప్రాణాలు అర్పించారు.వారి జ్ఞాపకార్థం ప్రతి పౌరుడూ గర్వించాలి అని పేర్కొన్నారు. సావర్కర్ చౌరస్తా నుండి సత్యనారాయణ చౌరస్తా వరకు జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ అంటూదీపాలతో ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శివ శంకర్, శ్వేత, శిరీష, అడ్వకేట్ రఘువీర్ యాదవ్, విశ్వహిందూ పరిషత్ , బజరంగ్ దళ్, యువత ప్రజలు నారాయణపేట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# అపరిశుభ్రతపై సీరియస్

- కేజీబీవీ ఎస్‌వోకు షోకాజ్ నోటీసు
- గండీడ్ మండలంలో పర్యటించిన అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



కస్తూర్బాలో మురుగును పరిశీలిస్తున్న మధుసూదన్‌నాయక్



సర్వేయర్ల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

**గండీడ్, అక్టోబరు26,ప్రభాతవార్త:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం గండీడ్ మండలం, రైస్ మిల్లులు తనిఖీ లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన రెవెన్యూ అదనపు కలెక్టర్ అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ గండీడ్ మండలంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం తనిఖీ చేశారు. అక్కడ వర్షం నీరు నిలువ ఉండటం, పరిసరాలు అపరిశుభ్రం ఉండటం చూసి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కు షోకాస్ నోటీసు ఇవ్వాలని డిఈఓను ఆదేశించారు. అక్కడ దోమలు రాకుండా పరిసరాల ను శుభ్రం చేయాలని మండల పరిషత్ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే గండీడ్ మండలంలో గల రైస్ మిల్లులను తనిఖీ చేసిసి సీఎంఆర్ డెలివరీ ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని రైస్ మిల్లుల యాజమాన్యాన్ని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ బాలుర కళాశాలలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు జరిగే రాత పరీక్ష కేంద్రాని జిల్లా అధికారులు ఏడి సర్వే కిషన్ రావు, పీడీ హౌసింగ్ భాస్కర్ తో పరిశీలించారు.

## నామినేషన్ వేసిన కలిమిచెర్ల రమేష్



నామినేషన్ పత్రం అందజేస్తున్న కలిమిచెర్ల రమేష్

**కల్వకుర్తి, అక్టోబర్ 26 ప్రభాతవార్త:** వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ వి 108 గవర్నర్‌గా కలిమిచెర్ల రమేష్ ఆదివారం మహబూబ్‌నగర్‌లోని వాసవి క్లబ్ భవనంలో నామినేషన్ ఎన్నికల అధికారి మాజీ గవర్నర్ జగదీశ్వర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్లు జూలూరు రమేష్ బాబు,హాకీం రాజేష్, హరికృష్ణ,రామకృష్ణ, రామేశ్వర్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో శివా జగదీశ్వర్, రమేష్,చిగుళ్ల పల్లి శ్రీధర్, శంకర్, మనోహర్, గోపాల్, హరీష్, ఆంజనేయులు, సంతోష్, కోటేశ్వర్, కిషన్, రాఘవేందర్, అశోక్, ప్రభాకర్, రాఘవేందర్,సురేష్, నరసింహులు గుప్త తో పాటు తదితరులున్నారు.

## 58వ ఖోఖో క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే



క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, అక్టోబర్ 26 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో 58వ ఖోఖో సీనియర్ బాలుర మరియు బాలికల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొని జిల్లాకు కల్వకుర్తి ప్రాంతానికి మంచి పేరుతీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. జిల్లాలో ఎలాంటి టోర్నమెంట్ తీసుకున్న దానికిపూర్తి సహకారం అందిస్తారనిఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి, నాయకులు మట్ట వెంకటయ్యగౌడ్, సంజీవ్ యాదవ్, జక్కుల చిన్న జంగయ్యయాదవ్,షాన్‌వాజ్‌ఖాన్,గోరటి శ్రీనివాసులు,కూనస్వామిలాబ్, బాలునాయక్, రమాకాంత్‌రెడ్డి, ఆర్గనైజర్ రాజు, పిడీలు పురన్ చందు, ప్రకాష్, జగన్ పాల్గొన్నారు.

## అమరులకు కొవ్వొత్తులతో నివాళి




**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు26,ప్రభాతవార్త:** పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మహబూబ్‌నగర్ పట్టణంలో పరదేశి నాయుడు సర్కిల్ నుంచి క్లాక్ టవర్ సర్కిల్ వరకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ, మానవహారం కార్యక్రమం నిర్వహించారు. దేశ ప్రజల రక్షణలో ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు స్మరణీయమని, వారి సేవలకు కృతజ్ఞతగా ప్రతి ఒక్కరు వారిని గుర్తుచేసుకుంటూ, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, రూరల్ సీఐ గాంధీ నాయక్, వుమెన్ పీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫ్ ఇన్స్పెక్టర్ భగవంత్ రెడ్డి, శీనయ్య, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు, ఇతర పోలీసు సిబ్బంది, విద్యార్థులు, మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరుల పట్ల తమ గౌరవాన్ని తెలియజేశారు. క్యాండిల్ లైట్లు వెలిగించి, ప్రార్థనతో అమరవీరులకు నివాళి అర్పించారు.

26ఎంబీఎన్ఆర్ 52: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

## భూత్పూర్ పరిధిలో పలు వివాహాలకు హాజరైన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు

**భూత్పూర్,అక్టోబర్ 26,ప్రభాతవార్త :** ఆదివారం భూత్పూర్ పట్టణ,రూరల్ పరిధిలో జరిగిన పలు వివాహాలకు బీఆర్ఎస్,కాంగ్రెస్ నాయకు లు హాజరై నూతన వధూవరుల్ని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని గోప్లాపూర్‌లో జరిగిన వెంకట స్వామి కుమారుడు ప్రశాంత్-అనన్యల వివాహానికి,లంబడికుంట తండా శంకర్‌నాయక్ కూతురు శ్రీలత-శ్రీరామ్‌ల వివాహానికి దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవితా మధుసూధన్‌రెడ్డితో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ ఇతర నాయకులు బోరింగ్ నర్సింహులు,లాలూ నాయక్,బజారు పరుశురాం,గడ్డం యాదయ్య(జగన్)చీపుర్ల భీంసేన్ పాల్గొని నూతన వధూవరుల్ని ఆశీర్వదించి శుభా కాంక్షలు తెలిపారు,గోప్లాపూర్‌తో పాటు లంబడి కుంటతండాలో జరిగిన బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకుడు శంకర్‌నాయక్ కూతరు శ్రీలత- శ్రీరామ్‌ల వివాహానికి, సిద్దయ్యపల్లిలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ అన్న కుమారుడి వివాహానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్,సత్తూర్ నారాయణగౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,టి మురళీధర్ గౌడ్,మనెమోని సత్య నారాయణ,మేకల సత్యనారాయణ,మూష సాయిలు,బాలకోటి,గడ్డం రాములు,రమేష్‌చందర్,సోనా సీడ్స్ అధినేత లడ్డుమియా పాల్గొని నూతన వధువరుల్ని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# వైభవంగా శ్రీకురుమూర్తి స్వామి పట్టు వస్త్రాల ఊరేగింపు



శ్రీకురుమూర్తి స్వామి వారి పట్టు వస్త్రాలను తలపై పెట్టుకొని మోస్తున్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

**అమరచింత అక్టోబర్ 26,ప్రభాతవార్త;** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అమరచింత పట్టణానికి చెందిన పద్మశాలీయాలు అనావైతిగా శ్రీ కురుమూర్తి స్వామికి స్థానిక మార్కండేయ స్వామి దేవాలయంలో పద్మశాలి చేనేతలు ప్రత్యేక మొగ్గంపై కటోర ఉపవాస దీక్షలతో తయారుచేసిన శ్రీ కురుమూర్తి స్వామి పట్టు వస్త్రాలకు ఆదివారం మార్కండేయ దేవాలయంలో పట్టు వస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ మార్కండేయ ఆలయం నుండి భాజా భజంత్రీల మధ్య బాణాసంచా కాలుస్తూ శ్రీ కురుమూర్తి స్వామి పట్టు వస్త్రాలను అమరచింత పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అమరచింత పట్టణంలోని శ్రీ కురుమూర్తి స్వామి పట్టు వస్త్రాలను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు, డాక్టర్ వాకిటి శ్రీహరి, దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే, జి. మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి, కేశం నాగరాజు గౌడ్ పట్టు వస్త్రాలను దర్శించుకొని తలపై పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ఆత్మకూర్ ఎస్బిఐ బ్యాంకులో శ్రీ కురుమూర్తి స్వామి ఆభరణాలతోపాటు పట్టు వస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మపురం గ్రామం సోం భూపాల్ దొర స్వగృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ కురుమూర్తి స్వామి దేవాలయానికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ లచ్చన్న, చింతన్న, పారుపల్లి సత్తన్న, కొంగరి భాస్కర్, ఎం రాజు, అయూబ్ ఖాన్, మహంకాళి విష్ణు, క్యామ శ్రీను, తాటి కొండ రమేష్, కృష్ణమూర్తి, మహంకాళి సత్యనారాయణ, మహంకాళి రాజు,వీరన్న, ఒగ్గుపాండు, ఆయా పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# కాంచన గుహకు కురుమూర్తి స్వామి ఆభరణాలు



కురుమూర్తి స్వామి ఆభరణాలకు పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**ఆత్మకూర్ అక్టోబర్ 26, ప్రభాతవార్త;** తెలంగాణ రాష్ట్రంలోనే పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణం లోని ఎస్బిఐ బ్యాంకు కార్యాలయం నుండి కురుమూర్తి స్వామి ఆభరణాలను వేదమంత్ర చరణాల మధ్య ఘనంగా కాంచన గుహలో వెలిసినటువంటి కురుమూర్తి స్వామి దేవస్థానానికి తరలించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన ఉద్దాల ఉత్సవం ఈనెల 28 మంగళవారం రోజు జరగనున్న నేపథ్యంలో కాంచన గుహలో వెలసిన కురుమూర్తి స్వామి లక్ష్మీదేవివిగ్రహాలకు ఆభరణాలు అలంకరించే కార్యక్రమాన్ని అలంకరణ ఉత్సవంగా పిలవబడతారు. అందులో భాగంగానే ఆదివారం రోజు ఆత్మకూర్ పట్టణంలోని ఎస్బిఐ బ్యాంక్ కార్యాలయంలో కురుమూర్తి స్వామి ఆభరణాలకు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, దేవరకద్ర శాసనసభ్యులుజి.మధుసూదన్ రెడ్డి, మహబూబ్నగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి, వనపర్తి ఎస్పీ రావుల గిరిజారి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బ్యాంకు కార్యాలయం నుండి గాడి వంశస్థులు శేషాచార్యులు తలపై ఎత్తుకొని ఆభరణాలను పట్టణంలో ఊరేగింపుగా బయలుదేరారు.బ్యాంకులో ఆభరణాలను దేవస్థాన అధికారులు కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ప్రభుత్వాధికారుల సమక్షంలో స్వామివారి అలంకరణఆభరణాలకు ప్రత్యేకపూజలు నిర్వహించి తరలించారు. స్వామివారి ఆభరణాల ఊరేగింపులో ఉమ్మడి ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి ఆభరణాలను తాకీ పునీతులయ్యారు. బ్యాంకు కార్యాలయం నుండి బయలుదేరిన ఆభరణాలు పట్టణ సమీపంలోని పరమేశ్వర స్వామి చెరువు ముందు రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఆభరణాలకు మరోమారు ప్రత్యేక పూజలు నిర్వహించి మదనాపురం మండలంలోని దుప్పల్లి గ్రామం మీదుగా కురుమూర్తి దేవస్థానానికి తరలించారు. స్వామి వారి ఆభరణాల ఊరేగింపు సందర్భంగా వనపర్తి ఎస్పి రావుల గిరిధర్ నేతృత్వంలో ఆత్మకూరు సిఐ శివకుమార్, పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు మధ్య ఆభరణాల ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందుగా ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకే మక్తల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, ఆధ్వర్యంలో ఎస్బిఐ బ్యాంకు కార్యాలయంలో గల కురుమూర్తి స్వామి ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పండితుల నుంచి ఆశీర్వచనాలు పొందారు. ఈ కార్యక్రమానికి వనపర్తి ఎస్పి రావుల గిరిధర్ ఆదేశాలతో ఆత్మకూరు సిఐ శివకుమార్ ఎస్సై నరేందర్ తదితరులు భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# జర్నలిస్ట్ ఇండ్ల స్థలాల సాధనే ధ్యేయం

**ఇండ్ల స్థలాల విషయంలో ఎలాంటి పోరాటాలకైనా వెనకడుగు వేసే ప్రసక్తే లేదు : టియుడబ్ల్యుజె ఐజెయు రాష్ట్ర కార్యదర్శి బి. మధుగౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్

**కొల్లాపూర్, అక్టోబర 26 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూలు జిల్లాలో జర్నలిస్ట్ లకు ఇండ్ల స్థలాల సాధనే లక్ష్యంగా కృషి చేస్తామని టియుడబ్ల్యుజె ఐజెయు రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ అన్నారు. ఆదివారం పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట గ్రామంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాష్ట్ర జాతీయ కౌన్సిల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగర్‌కర్నూలు జిల్లా అధ్యక్షుడు పి.విజయ్ కుమార్ అధ్యక్షత వహించగా కార్యదర్శి ఆర్ సురేష్ కుమార్ ఆహుతులకు స్వాగతం పలికారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి మధుగౌడ్ హాజరయ్యారు. అతిథులుగా నూతనంగా ఉమ్మడి జిల్లా జాతీయ కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల హెల్త్ కార్డులకు సంబంధించి ప్రెస్ అకాడెమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శుల కృషితో ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలమయి ఒక తీపి కబురు జర్నలిస్టులకు అందనుందని అన్నారు. అక్రిడేషన్ కార్డుల జారీ విషయంలో నియమ నిబంధనల విషయంలో స్పష్టత వచ్చిందని త్వరలోనే అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు.జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు ఇండ్లు సాధించే విషయంలో ఎలాంటి పోరాటాలకైనా జర్నలిస్టులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలో టియుడబ్ల్యుజె ఐజెయు సభ్యత్వాలలోను కార్యక్రమాల నిర్వహణలోను దూసుకుపోతోందని ఇదే స్థాయిలో జర్నలిస్టల సమస్యల పరిష్కార దిశగా మన మందరం ముందడుగు వేయాలని ఆయన కోరారు. నాగర్ కర్నూ లు జిల్లాఅధ్యక్షులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులపై జరిగే దాడులుఇతర అంశాలపై ఆందోళనలు చేయవలసి వచ్చిన పుడు ఎవరికి వారి స్వంత నిర్ణయాలు తీసుకోకుండా రాష్ట్ర కమిటీ తగుసూచనలు చేసి ఏకతాటిపై జరిగేలా చూడాలని కోరారు. గద్వాల, వనపర్తి అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ యూనియన్ పటిష్టత కోసం ఇతర అంశాలపై ఆయా జిల్లాలలో తీసుకుంటున్న చర్యలనువివరించారు.ఈ సందర్భంగా నూతనంగా జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన గోలి సుదర్శన్ రెడ్డి, కర్ణయ్య కుమార్, మాల్యల బాలస్వామి, ప్రశాంత్, శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులును సన్మానించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు. జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పాల్గొన్నారు.కొల్లాపూర్‌నియోజకవర్గ వర్గఅధ్యక్షుడు మాలే రాజేందర్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాగర్ కర్నూలు జిల్లా రెండవ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా కార్యదర్శి ఆర్. సురేష్ కుమార్ త్రైమాసిక కార్యక్రమాల నివేదిక సమర్పించారు. జిల్లా కేంద్రంలో ప్రధాన భూమిక పోషించిన రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ కు జిల్లా జర్నలిస్టుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.నియోజకవర్గ స్థాయి సమావేశాల నిర్వహణపై చర్చించారు. జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న వారికి జిల్లా కౌన్సిల్ సభ్యులు రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.





రోడ్లపై గుంపులు గుంపులుగా వీధి కుక్కలు

## వీధి కుక్కలతో భయం భయం

**ధన్వాడ, అక్టోబరు26 ప్రభాతవార్త:** రోడ్లపై వీధి కుక్కలు విపరీతంగా తిరుగుతూ ప్రజలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. వీధి కుక్కల బారి నుంచి రక్షించాలంటూ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. ఎప్పుడు ఎక్కడి నుంచి ఏ వీధి కుక్క వచ్చి కరుస్తుందని ప్రజలు బయందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రమైన ధన్వాడలో పలు ఏరియాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా కుక్కలు రావడం తో ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వాపోతున్నారు.రాత్రి వేళ రోడ్లపై నడవడం భయంకరంగా మారింది. పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు భయంతో బయటకు రావడం మానేస్తున్నారు. కొన్ని కుక్కలు రోడ్డుపై వాహనాల వెంటపడుతూప్రమాదాలు సృష్టిస్తున్నాయి.ఈ సమస్యపై పంచాయతీ / పశువైద్య శాఖ ద్వారా తక్షణ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**వీధి కుక్కలపై అధికారులు చర్యలు తీసుకోవాలి : ఎర్రగటి పల్లి కథలప్ప, ధన్వాడ**



వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయాలి. కుక్కలకు టీకాలు వేయాలి. చెత్త డబ్బాలు ఏర్పాటు చేసి ఆహార వ్యర్థాల వలన కుక్కలు చేరకుండా చూడాలి.. అవసరమైతే కుక్కలను తాత్కాలికంగా పట్టుకొని పశువైద్య విభాగానికి అప్పగించాలని ప్రజల భద్రత కోసం వెంటనే చర్యలు తీసుకోవాలి.

## బస్సు కిందపడి మహిళకు తీవ్ర గాయాలు

**పెబ్బేరు, అక్టోబరు26 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఓ మహిళ బస్సు దిగి వెనుక వైపు వెళ్తుండగా డ్రైవర్ అజాగ్రత్త వల్ల చూసుకోకుండా రివర్స్ వెళ్లడంతో టైర్‌కిందపడి తీవ్రగాయాల పాలైనసంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం..నారాయణపేటకు చెందిన కోటకొండ అంజమ్మ గద్వాల నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులోపెబ్బేరుకు చేరుకొనిబస్సుదిగి మెల్లగా నడుస్తూ ముందుకు వెళ్తుంది.. మహిళను చూసుకోకుండా డ్రైవర్ బస్సును కదిలించడంతో వెనక టైర్ కిందపడటంతో రెండు కాళ్ళు నుజ్జు నుజ్జు అయ్యాయి.108కు సమాచారంఇవ్వడంతో వెంటనేఅక్కడికి చేరుకున్న సిబ్బంది,పోలీసులు క్షతగాత్రురాలిని వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు.ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివ రాల ప్రకారం అంజమ్మకు ఒకకూతురు ఉండగా ప్రస్తుతం హాస్పిటల్‌లో ఉన్నందుకు ఇంతవరకు ఇంకా కేసు నమోదు చేయలేదని తెలియజేశారు.

## భూత్పూర్‌కు చెందిన సౌమ్యకు గ్రూప్-2 ఉద్యోగం



**భూత్పూర్,అక్టోబర్ 26,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన గ్రూప్2లో భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని గోప్లాపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ,బీఆర్ఎస్ నేత మేకల సత్యనారాయణ కూతురు సౌమ్య ఐసీడీసీ స్త్రీ,శిశు సంక్షేమశాఖలో గ్రేడ్1 కేడర్‌లో జోగుళాంబ గద్వాల జిల్లా జోన్‌లో 9వ ర్యాంకుతో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం దక్కించుకున్నారు.సౌమ్య మూడేళ్ల క్రితం నిర్వహించిన ఇదే పోస్టుకు రాష్ట్రవ్యాప్త 40వ ర్యాంక్ సాధించి టాపర్‌గా నిలిచారు.సౌమ్య రాష్ట్ర మంత్రి సీతక్క చేతులమీదుగా నియామ కపు పత్రాన్ని అందుకున్నారు.గ్రూప్2 పోస్ట్ దక్కించుకున్న గోప్లాపూర్‌కు చెందిన సౌమ్య, ఆమె తండ్రి సత్యనారాయణను పలువురు బీఆర్ఎస్ నాయకులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

## నేడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**లింగాల, అక్టోబరు 26 ప్రభాతవార్త:** లింగాల మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని నేడు ప్రారంభిస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ జంబుల ఆనంద్ రెడ్డి తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, అదేవిధంగా డిసిసిబి చైర్మన్ మామిళ్ళ విష్ణువర్ధన్ రెడ్డి, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రజిత మల్లేష్, నాగర్ కర్నూల్ డిసిఓ వస్తున్నట్లు తెలిపారు. మండలంలోని సింగిల్ డైరెక్టర్ లు,మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు,రైతు సోదరులు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# 150 ఇండ్లలో సోదాలు

- 19 బైక్‌లు,6 ఆటోలు స్వాధీనం
- జడ్చర్లలో విస్తృతంగా కార్డన్ సెర్చ్
- అక్రమ వాహనాలు, నేరాలను నివారించేందుకే : డీఎస్పీ వెంకటేశ్వర్లు







కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

**జడ్చర్ల, అక్టోబరు 26, ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు, డీఎస్పీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో, జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ఆదివారం ఉదయం శాంతినగర్, శ్రీరామ్ నగర్ ప్రాంతాల్లో విస్తృతంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ సమయంలో వెలుగులోకి వచ్చిన అంశాలు 150 ఇళ్లను సోదా నిర్వహించగా సరైన పత్రాలు లేని 19 మోటర్ బైకులు స్వాధీనం చేసుకున్నారు. 6 ఆటో రిక్షాలు అనుమానాస్పదంగా ఉండడంతో ధృవీకరణ కోసం నిలిపివేశారు. కాలనీలో నివాసం ఉంటున్న సందేహాస్పద వ్యక్తులపై విచారణ చేపట్టారు. కొన్ని ఇళ్లలో అసాధారణ కదలికలు గమనించి, మౌలిక సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల భద్రత మా మొదటి కర్తవ్యమని, కార్డన్ సెర్చ్ ద్వారా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను గుర్తించి నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి" అని తెలిపారు. అక్రమ వాహనాలు, నేర చట్రాలు గుర్తించి నివారించడం, శాంతి భద్రతల పరిరక్షణకు అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించడం. గూండాలు, డ్రగ్స్, మత్తు పదార్థాల సరఫరా వంటి నేరాలపై కట్టుదిట్టమైన నిఘా ఉంచడమే కార్డన్ సెర్చ్ ప్రధాన ఉద్దేశమన్నారు.

**ఇవీ ప్రజలకు సూచనలు...**

- సరైన పత్రాలు లేని వాహనాలను నడపరాదు.
- కొత్త అద్దెదారుల వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయాలి.
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోబడతాయి.
- ఏదైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే 100 నంబర్‌కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.
- మహబూబ్ నగర్ పోలీసులు ప్రజల భద్రతకు కట్టుబడి ఉన్నారు.
- శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి తనిఖీలు తరచుగా కొనసాగుతాయి. కార్యక్రమంలో జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, జడ్చర్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగార్జున గౌడ్, ఎస్ఐలు జయ ప్రసాద్, మల్లేష్, చంద్రమోహన్, ఖాదర్, రాజాపూర్ ఎస్ఐ శివానంద్ తదితర పోలీసులు పాల్గొన్నారు.

### అధికారులు, మిల్లర్లు కుమ్మక్కు?

# వడ్ల నిల్వలలో గోల్ మాల్

- ◆ చేతులు మారుతున్న కోట్ల రూపాయలు?
- ◆ ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యంపై రైస్ మిల్లర్ల ఇష్టారాజ్యం
- ◆ సి.ఎం.ఆర్ వడ్లు అక్రమ తరలింపు
- ◆ పెద్దల పాలైన పేదోళ్ల బియ్యం
- ◆ విజిలెన్స్ అధికారుల దాడులలో బయటపడ్డ భాగోతం


విజిలెన్స్ అధికారులు దాడులు చేసిన రైస్ మిల్లు (ఫైల్)

**గద్వాల అక్టోబర్ 26, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో రైస్ మిల్లుల లో జరిగిన సి ఎం ఆర్ వడ్ల నిల్వలపై దొంగే దొంగా, దొంగా అన్నట్లుగా వుంది. రైస్ మిల్లర్లు టెండర్ దారునిపై, టెండర్ దారుడు మిల్లర్ల పై ఇలా ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ తప్పించుకుంటున్నారు. వడ్లు అమ్మినోళ్లు దొంగలు అయితే అవికొన్న వాళ్ళు దొంగలు కారా అన్నది ప్రశ్నార్థకం....? గద్వాల జిల్లాలో 33 రైస్ మిల్లులు ఉండగా దాదాపుగా అన్ని మిల్లులలో సి ఎం ఆర్ వడ్ల నిల్వలలో గోల్ మాల్ వ్యవహారం నడుస్తున్నట్లు సమాచారం. సి ఎం ఆర్ వడ్లు ఏ సంవత్సరం ఏ మిల్లుకు ఎన్ని వడ్లు ఇచ్చింది అధికారులతో లెక్కలు ఉన్నాయి కానీ రైస్ మిల్లర్లు మరాడించీ ఇచ్చిన బియ్యానికి మాత్రం అడ్డగోలు లెక్కలు ఉన్నట్లు తెలుస్తుంది. వడ్లు మరఆడించి పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేందుకు మిల్లర్ల యజమానులు ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వీటిపై పూర్తి సమాచార సేకరణకు జిల్లా డి ఎస్ ఓ కార్యానికి పలు మార్లు వెళ్ళినా జిల్లా అధికారి కార్యాలయంలో అందుబాటులో వుండడు, ఫోన్ చేస్తే కూడా స్పందన ఉండదు. రైస్ మిల్లర్ల మాయాజాలంతో కోట్లరూపాయలు చేతులు మారుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మిల్లర్లకు, సంబదిత శాఖ అధికారులతో పాటు కొంతమంది ప్రజాప్రతినిధుల అండ దండలు కూడా వున్నట్లు పలువురు వ్యక్తం చేస్తున్నారు. సి ఎం ఆర్ వడ్ల అక్రమ తరలింపు దందాలోదాదాపు కోట్ల రూపాయలు దండుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు. పేదల నోటికాడి బియ్యం పెద్దలు బొంచేసి, వాళ్ళు చేస్తున్న అక్రమాలు కళ్ళ ముందు కనిపిస్తున్న వాస్తావాలు బయటకు రాకుండా రాష్ట్ర స్థాయి ప్రజా ప్రతినిధులతో పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో తూ తూ మంత్రంగా ఆర్ ఆర్ యాక్ట్ కింద నోటీసులు ఇచ్చి అధికారులు చేతులుదులిపేసుకుంటున్నారు. కేసులు చేశాం అని చెప్పుకోవడానికి తప్పా తప్పులు చేసిన మిల్లర్ల యజమానులపై కటిన చర్యలు తీసుకుని ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను, బియ్యాన్ని వసూలు చేశామని ఎక్కడ కనిపిస్తుందనీ ప్రశ్నిస్తున్నారు. కొంతమంది సివిల్ సప్లై అధికారులు మిల్లర్లతో కుమ్మక్కైనందుకే ప్రభుత్వ అనుమతులు లేకుండా వడ్లను పక్కదారి పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం అవుతున్నట్లు తెలుస్తుంది. దీంతో జిల్లాలోని రైస్ మిల్లులలో వడ్లు, బియ్యం అక్రమ దందా పరంపర కొనసాగుతూనే వుందనీ పలువురు వ్యక్తం చేస్తున్నారు. గత 18 వ తారీకు గద్వాల పట్టణ శివారు జూరాల డ్యాంకు వెళ్లే దారిలో వున్న శ్రీరామ రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారులు దాడులు చేయగా విస్తృత పోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. పెద్దమొత్తంలో దాదాపు 2.25 కోట్ల విలువ చేసే వడ్లను అక్రమంగా అమ్ముకున్నట్లు బయటపడింది. 2022-23 సంవత్సరానికి కేటాయించిన 26,242 బస్తాల వడ్లను మాయం చేసినట్లు విజిలెన్స్ అధికారులు డీఎస్పీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా వున్న రైస్ మిల్లుల లో మొత్తం కలిపి 25,503 మెట్రిక్ టన్నుల వడ్లు పక్కదారి పట్టినట్లు అంచనా వేశారు. పక్కదారి పట్టించిన మిల్లు ఓనర్ పై క్రిమినల్ కేసులు పెట్టమని తెలిపారు. కానీ నేటికి వారితో వడ్లు కానీ, బియ్యం కానీ, దానికి తగిన సొమ్ము కానీ రికవరి చేసిన దాఖలాలు లేవు. తెలంగాణ ధాన్యం పక్క రాష్ట్రాలకు సరఫరా... జిల్లాలో వున్న రైస్ మిల్లర్లు నాణ్యమైన బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. ప్రజా పంపిణీకి ఇచ్చే బియ్యాన్ని మిల్లర్లు నాణ్యత లేని తక్కువ ధర గల బియ్యన్నీ తీసుకొచ్చి ఇక్కడ సరఫరా చేశారని తెలుస్తుంది. జిల్లాలోని గల కొన్ని రైస్ మిల్లుల దగ్గర అర్ధరాత్రి పూట లారీలలో లోడ్ చేసుకుని తమిళనాడు మరి ఇతర రాష్ట్రాలకు వడ్లను అమ్ముకున్నట్లు పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చిన ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. పేదల ధాన్యాన్ని కొన్నది ఎవరూ...? 2022 23 సంవత్సరం రబీ సీజన్ కు సంబంధించిన వడ్లను రైస్ మిల్లర్లు మిల్లుల లో నిల్వ ఉంచుకుని వాటిని మర ఆడించి ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాల్సిన బియ్యాన్ని ఇవ్వలేక పోయినందున, ప్రభుత్వం వాటిని క్వింటాల్ 2 వేలకుధర నిర్ణయించి నలుగురి కాంట్రాక్టర్లకు వేలం వేసింది. వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్లు వడ్లను తీసుకెళ్లక పోవడంతో మిల్లర్లు వడ్లు ముక్కి పోతున్నాయని, సంచుల్లో కారిపోతున్నాయి అని, తడిసి పోతున్నాయని, వచ్చే వడ్లను స్టాక్ చేసుకోవడానికి మిల్లులోస్థలం లేదని మిల్లు యజమానులు సాకులు చెప్పి అమ్మేసుకున్నారు. దాదాపు 26,242 వేల వడ్ల బస్తాలను రైస్ మిల్లు యజమానులు మాయం చేసి అమ్ముకున్నట్లు కనుగొన్న అధికారులు, వాటి ని కొన్న వ్యక్తులను కనుగొనలేరా అన్న ప్రశ్న అందరిలో ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ ధాన్యాన్ని అమ్ముకున్న వారే దొంగలా, లేక ఆధాన్యాన్ని కొన్నవ్యక్తులు కూడా దొంగలా అన్నది అధికారులు బయటపెట్టాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పలు వార్త దినపత్రికలలో సిఎంఆర్ వడ్ల పక్కదారి పై వరుస కథనాలు వస్తున్నా సంబధిత శాఖ అధికారులు, జిల్లా ఉన్నత అధికారులు చలించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. అక్రమాలకు పాల్పడ్డవారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని, వడ్ల అక్రమాల గుర్చి అధికారులు తెలిపి పది రోజులు కావస్తున్న వడ్లను అమ్ముకున్న అక్రమార్కులపై కటిన చర్యలు తీసుకోవడానికి జాప్యం ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. మరోసారి ఇలాంటి అక్రమాలు జరగకుండా వారి నుండి అంతకు అంతా కక్కించాలని కోరుతున్నారు.


లారీలలో తరులుతున్న బియ్యం (ఫైల్)


మొక్కజొన్నను పరిశీలిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## రైతు పక్షపాతి కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

చేసి పత్తి పంటను కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. పంట సాగు చేసేసమయం నుంచి విక్రయించే వరకు చేసిన కష్టానికి ప్రతిఫలం దక్కే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రైతన్నకు వెన్నుదన్నుగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఉమ మనిలా సంజీవ్, మాజీ సర్పంచ్‌లు సుదర్శన్ రెడ్డి, బృంగి ఆనంద్‌కుమార్, నాయకులు నారాయణరెడ్డి, మట్ట వెంకటయ్యగౌడ్, జక్కుల చిన్నజంగయ్యయాదవ్, మార్కెట్ డైరెక్టర్ లు రమాకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మక్బూల్, బాలు నాయక్, రేష్మాబేగం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా జిల్లా క్లబ్ ఎన్నికలు

**- ఓటు హక్కు వినియోగించకున్న ఎమ్మెల్యేలు, ప్రముఖులు**





**మహబూబ్‌నగర్ , అక్టోబర్26, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా క్లబ్ ఎన్నికలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఈమేరకు జిల్లాలోని పలువురు రాజకీయ వ్యాపార, వివిధరంగాలకు చెందిన ప్రముఖులు తమ ఓటు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో భాగంగా డీసీసీ అధ్యక్షుడు దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తోపాటు పలువురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈమేరకు క్లబ్ ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. వీరితోనాటు మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ బండారి శాంతికుమార్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఎం సురేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆనంద్‌గౌడ్ తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### 111 ఆదివాసి జంటలను ఒకే వేదికపై

# వివాహాలు చేయడం అభినందనీయం


నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, బండారు దత్తాత్రేయ

(మొదటి పేజీ తరువాయి)

జంటలు సుఖ సంతోషాలతో పిల్లపాపలతో కలికాలం కలిసుండాలని గవర్నర్ ఆశీర్వదించారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ ప్రకారం ఆదివాసీల వివాహాలు జరిపించడం అభినందనీయమని నిర్వాహకులను ఆయన అభినందించారు. చెంచు గిరిజనుల సామాజిక వివాహ మహోత్సవాలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరై ఆశీర్వదించడం అభినందనీయం అన్నారు. హైకోర్టుజడ్జ్ టి.మాధవి దేవి మాట్లాడుతూ సామూహిక వివాహాలలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకు ఇద్దరు కుమారులేనని, ఆడపిల్లలు లేరని వివాహం చేసుకున్న ఆదివాసి బిడ్డలు తన కూతుర్లు లాంటి వారని హైకోర్టు జడ్జ్ టి.మాధవి దేవి అన్నారు. తాను ఇదే నల్లమల కోడలినని పదర మండలం ఉడిమిళ్ళ గ్రామానికి చెందిన తంగిరాల హనుమంత రెడ్డి కుటుంబం అన్నారు. నిరుపేదలైన చెంచు గిరిజనులకు తన అండదండలు ఎప్పటికీ ఉంటాయని, ఏ ఆపద వచ్చిన తాను అండగా ఉంటానన్నారు. అంతకుముందు నారాయణపేట జిల్లా అంబ్రతేయ క్షేత్రానికి చెందిన ఆదిత్య పరాశర స్వామి ఆశీర్వచన ప్రసంగం గావించారు. సామూహిక వివాహాలకు హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సామూహిక వివాహాలు చేసుకున్న నూతన వధువరులకు వివాహ సర్టిఫికెట్లను గవర్నర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కళ్యాణ పరిషత్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఉడతనూరి లింగయ్య, తెలంగాణ ఆదివాసి మహిళ ప్రముఖ గుర్రం శంఖులత, ఆర్ఎస్ఎస్ బాధ్యులు ఏమి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్ రాజు, భాస్కరాచారి, వీరితో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు. తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


మాట్లాడుతున్న హైకోర్ట్ జడ్జీ టి.మాధవి దేవి


గవర్నర్ ఆశీర్వాదం తీసుకుంటున్న నూతన వధువరులు

## అవార్డులే ప్రేరణ

**- తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి**



**మహబూబ్‌నగర్, అక్టోబరు26, ప్రభాతవార్త:** అవార్డులు రచయితలకు, కవులకు గొప్ప ప్రేరణ, భాద్యతను కలిగిస్తాయని, వారి కృషికి తగ్గ ప్రతిఫలం లభించిందని భావించేలా చేస్తాయని ప్రముఖ రచయిత, కవి, విమర్శకులు, తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ లోని కాళోజీ హాల్ లో ప్రముఖ కవి, రచయిత డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు రచించిన పెంకు టిల్లుకవితా సంపుటి అవార్డు- 2024ను అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేటి కవులు కవిత్వాన్ని సీరియస్ గా రాయాలని, అలా రాస్తున్న వారిలో కాంచనపల్లి ఒకరని ఆయన అన్నారు. కాంచనపల్లి కి పాలమూరు సాహితీ ప్రకటించడం సరైన నిర్ణయం అని అన్నారు. అనంతరం డాక్టర్ కాంచనపల్లికి పాలమూరు సాహితీ అవార్డు కింద ఆయన ను శాలువాతో సత్కరించి 5116 నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖన్యాయవాదులు మనోహర్‌రెడ్డి, బుర్రి వెంకట్రామిరెడ్డి, కాళోజీ అవార్డుగ్రహీత కోట్ల వెంకటేశ్వరరెడ్డి, పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, బోల యాదయ్య, వెంకటేశ్వరరావు, ఏపూరి కిష్టప్ప, సురభి జగపతిరావు పాల్గొన్నారు.

## మత్స్య కారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**సంగాల చెరువులో చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి**



**గద్వాల టౌన్ అక్టోబర్ 26, ప్రభాతవార్త:** మత్స్య కారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలోని సంగాల చెరువుదగ్గర ఏర్పాటు చేసిన మత్స్య కారులకు ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై రెండు లక్షల చేప పిల్లలను సంగాల చెరువు రిజర్వాయర్ లో వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. తెలంగాణ ప్రభుత్వం వందశాతం రాయితీ పై మత్స్యకారులకు చేపపిల్లలను సరఫరా చేసిందనీ, రాష్ట్రంలో కుల వృత్తులను కాపాడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మిగిలిన రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో నదులు, సముద్రాల శాతం తక్కువ అని అయినా ఉన్న నీటి వనరులనే సద్వినియోగం చేసుకుని చేపల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అన్ని చెరువులను అభివృద్ధి చేసి చేపపిల్లలను పెంచేందుకు అనువైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. మత్స్యకారులు కూడా ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుంది అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మత్స్యకార శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి కి గద్వాల మత్స్యకారుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి షకీలా, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కురువ హనుమంతు రాష్ట్ర వినియోగదారుల ఫోరం మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, ఆలయం కమిటీ చైర్మన్ బోయ వెంకటరాములు, మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, మాజీ కౌన్సిలర్స్ శ్రీను ముదిరాజ్, పూడూరు కృష్ణ, నరహరి గౌడ్, శ్రీమన్నారాయణ, నాయకులు రిజ్వాన్, నాగులు యాదవ్ సుదర్శన్, యుగంధర్ గౌడ్, ధర్మ నాయుడు, మోబిన్, సంగాలనర్సింహులు, రామాంజనేయులునాగేంద్ర, దౌలన్న లక్ష్మన్న, గాంధీ, గువ్వల గోపాల్, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**నారాయణ పేట, అక్టోబరు 26 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఎస్పీ డా.వినీత్ ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నారాయణపేట పట్టణం లో సావర్కర్ చౌరస్తా నుండి సత్యనారాయణ చౌరస్తా వరకు పోలీసులు యువత ప్రజలు కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరవలేనివి వారు సంఘవిద్రోహ శక్తులతో పోరాడి ప్రాణాలు అర్పించారు. వారి జ్ఞాపకార్థం ప్రతి పౌరుడూ గర్వం చాలి అని పేర్కొన్నారు. సావర్కర్ చౌరస్తా నుండి సత్య నారాయణ చౌరస్తా వరకు జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ అంటూదీపాలతో ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శివశంకర్, శ్వేత, శిరీష, యువత ప్రజలు నారాయణపేట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సువర్ణ బూషితుడైన కురుమతి స్వామి

(మొదటి పేజీ తరువాయి)

ఇతర ప్రజా ప్రతినిధులు ఆభరణాల దర్శించుకున్నారు. అక్కడి నుంచి నంబి వంశీయులు స్వామి వారి ఆభరణాల పెట్టెను తలపై ఉంచుకుని కాలినడకన అమ్మాపురం ప్రధాన రహదారి మీదుగా సాయంత్రం ఆభరణాలను స్వామి వారి గుట్టకు చేరుకున్నాయి. దేవస్థాన అధికారులు సమక్షంలో అభరణాలను ఒక్కొక్కటిగా లెక్కించి ఆలయ అర్చకులకు అప్పగించారు అర్చకులు ముక్కెర వంశపు రాజులు చేయించిన బంగారు ఆభరణాలను స్వామివారికి అలంకరించడంతో దేవరగట్టులోని కాంచన గుహ స్వర్ణకాంతులతో పులకరించింది. ఆభరణాలను అలంకరించడంతో స్వామివారు సువర్ణ భూషితుడుగా భక్తులకు దర్శనమిచ్చారు. అలంకార ఉత్సవంలో మాజీ జెడ్పి చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, నాయకులు అరవింద్ కుమార్‌రెడ్డి, కొండా ప్రశాంత్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, నాగరాజుగౌడ్, వివిధ పార్టీలనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్వామి ఆభరణాలకు పూజలు నిర్వహిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి




స్వామి వారి ఆభరణాలను లెక్కిస్తున్న దృశ్యం

## ఆడబిడ్డ పెండ్లికి అభిమన్యు రెడ్డి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న అభిమన్యు యువసేన నాయకులు

**రాజాపూర్, అక్టోబర్26, ప్రభాతవార్త:** రాజాపూర్ మండలంలోని కుచ్చర్కల్ గ్రామపంచాయతీకి చెందిన జక్క శ్రీను కూతురు స్వాతి వివాహానికి బీఆర్ఎస్ యువ నాయకుడు చింపోడ్ అభిమన్యురెడ్డి రూ.10,000 ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈమేరకు ఆదివారం యువసేన నాయకులుపెండ్లికి హాజరై పెళ్లి కూతురుకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ గౌడ్, నర్సింలు, బోయ శ్రీశైలం, జక్క శ్రీశైలం, రవి, రాఘవేందర్, రాజేష్, మరియు గ్రామస్తులు మరియు బీఆర్ఎస్ నాయకులు, యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 58వ ఖోఖో క్రీడలు ప్రారంభం

**కల్వకుర్తి, అక్టోబర్ 26 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో 58వ ఖోఖో సీనియర్ బాలుర మరియు బాలికల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎమ్మెల్యేశుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి, నాయకులు మట్ట వెంకటయ్యగౌడ్, సంజీవ్ యాదవ్, జక్కుల చిన్న జంగయ్యయాదవ్, షాన్‌వాజ్‌ఖాన్, గోరటిశ్రీనివాసులు, కూనస్కై లాబ్, బాలునాయక్, రమా కాంత్‌రెడ్డి, ఆర్గనైజర్ రాజు, పిడీలు పురన్ చందు, ప్రకాష్, జగన్ పాల్గొన్నారు.